క్లుప్తంగా

నెట్టికంటుడికి రూ.1.5 లక్షల విరాళం



సూపరింటెండెంట్ వెంకటేశులుకు నగదు అందజేస్తున్న దాతలు

గుంతకల్లు రూరల్: కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన బి.విజయలక్ష్మి, బి.సరస్వతమ్మ కుటుంబ సభ్యులు శుక్రవారం స్వామివారి నిత్యాన్న సత్రం నిర్వహణకు రూ.1.5 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యుల పేరున ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు అనంతరం వారికి స్వామివారి తీర్థప్రసాదాలను, శేషవస్త్రాలను అందజేశారు.

బీడీ కార్మికులను ఆదుకోవాలి



ఇంటింటా ప్రచారం చేస్తున్న నాయకులు

తాడిపత్రిటౌన్: బీడీ కార్మికులను ఆదుకోవాలని ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఓబుల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని రమేష్‌రెడ్డి కాలనీ, పాతకోట, పడమటిగేరి, కాలువగడ్డవీధి, టైలర్స్ కాలనీల్లో శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాడిపత్రిలో బీడీ కార్మికుల కూలి రేట్లు దారుణంగా ఉన్నాయన్నారు. సెంట్రల్ వేజ్‌బోర్డు ప్రకారం వెయ్యి బీడీలకు రూ.500 ఉండగా తాడిపత్రిలో కనీసం రూ.300 కూడా ఇవ్వడం లేదన్నారు. కార్మికులకు గుర్తింపుకార్డులు, ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉమాగౌడ్, సూరి, రామక్రిష్ణ, భాస్కర్, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవం విజయవంతం చేయండి



బ్రోచర్లు విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గుంతకల్లు: మార్చి 8 నుంచి 10వ తేదీ వరకూ నిర్వహించే అన్నపూర్ణేశ్వరి ఆలయ పంచమ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్త టి.రామలింగ, ప్రధాన అర్చకుడు యస్.మోహన్‌శర్మ కోరారు. శుక్రవారం కసాపురం రోడ్డులోని పిరమిడ్ ధాన్యకేంద్ర సమీపంలోని అన్నపూర్ణేశ్వరి ఆలయంలో వార్షికోత్సవ బ్రోచర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ స్వర్ణాకర్షణ కాలభైరవేశ్వర స్వామి సహిత, ఆదిశక్త్యాత్మిక అన్నపూర్ణేశ్వరి ఆలయంలో ఈ నెల 8న సామూహిక కాళభైరవ హోమం, 9 వతేదీ ప్రథమరాధన, దుర్గాపూజ, సామూహిక చండీహోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 10వ తేదీ మూలవిరాట్ అమ్మవారికి విశేష అలంకరణ, విశేషార్చన ఉంటుందన్నారు. పూజల్లో పాల్గొనే భక్తులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

దత్తాత్రేయుడికి పూజలు



పామిడి: పట్టణంలోని దత్త పాదుకా క్షేత్రంలో శుక్రవారం మాఘమాసం బహుళ అష్టమిని పురస్కరించుకుని అర్చకుడు అమరేంద్రనాథ్ ఆధ్వర్యంలో దత్తాత్రేయుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా దత్తాత్రేయ, అనఘాదేవికి అష్ట సిద్దులకు చెందిన ఎనిమిది కలశాలను ఏర్పాటు చేసి, అవాహన పూజలు చేశారు. మహిళాభక్తులు భక్తిప్రపత్తులతో అనఘాదేవి వ్రతాన్ని ఆచరించారు. వ్రత కంకణ బంధాన్ని అందరికి ధరింపజేశారు. మంగళహారతి అనంతరం జవల్కర్ శ్రీనివాసరావు సౌజన్యంతో భక్తాదులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా పంచలోహ విగ్రహ ప్రతిష్ట



రేణుక ఎల్లమ్మకు పూజలు చేస్తున్న దృశ్యం


పామిడి: పట్టణంలోని వాణీనగర్‌లోని నూతన రేణుక ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో రూ.లక్ష వ్యయంతో తయారు చేయించిన పంచలోహ విగ్రహ చర ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా చేపట్టారు. వేదపండితుడు వెంకటేష్ ఆధ్వర్యంలో అభిషేక పూజలతో పాటు ప్రత్యేక ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విగ్రహాన్ని మంగళ వాయిద్యాలు, డప్పులు, భజనలతో గ్రామోత్సవం చేశారు. నిర్వాహకులు రంగనాయకులు, ఓబుళపతి, భక్తులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా ప్రైవేట్ స్కూళ్లు



- అనుమతి లేకున్నా అడ్మిషన్లు ప్రారంభం
- కొరవడిన విద్యాశాఖ అధికారుల నిఘా

తాడిపత్రిటౌన్: విద్యను వ్యాపారంగా మలుచుకుని తాడిపత్రిలో పలు ప్రైవేట్ స్కూళ్లు దందా సాగిస్తున్నాయి. విద్యాధికారులు నిద్రమత్తులో ఉండడంతో వీధికో ప్రైవేట్‌స్కూల్ పుట్టుకొస్తున్నాయి. అనుమతులు లేకున్నా.. సరైనా వసతులు లేకున్నా.. ఇరుకు సందుల్లో కోళ్ల ఫారాలను తలపించే రేకుల షెడ్‌లలో పాఠశాలలను నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నా అధికారులు ఏమి పట్టనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. తాడిపత్రి పట్టణంలో ప్రభుత్వ అనుమతితో దాదాపు 48 ప్రైవేట్ పాఠశాలలున్నాయని అధికారులు చెబుతున్నా.. వందల సంఖ్యలో ప్రైవేట్ పాఠశాలలు కనిపిస్తున్నాయి. వాటిలో వేళ్లపై లెక్కపెట్టే పాఠశాలలో మినహా ఎక్కడా కూడా ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదు. కొన్ని ప్రైవేట్‌స్కూల్‌లు 7వ తరగతి వరకూ అనుమతి పొంది 10వ తరగతి వరకూ అడ్మిషన్ తీసుకుంటూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి.



విద్యార్థుల భద్రత గాలికి..

ఇరుకు సందులు, అపార్ట్‌మెంట్ భవనాలు, రేకుల షెడ్‌లలో బడులు నిర్వహిస్తూ విద్యార్థుల భద్రతను గాలికి వదిలేశారు. ఏదైనా ప్రమాదం జరిగితే విద్యార్థుల భవిష్యత్ ఏంటన్న ప్రశ్నకు యాజమాన్యాల వద్ద సమాధానం లేకుండా పోయింది. అధికారులు కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రైవేట్‌పాఠశాలల యాజమాన్యలు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. ఆటపాటల సంగతి అటుంచితే కనీసం విద్యార్థులు మలమూత్రాలు ప్రశాంతంగా విసర్జించలేని పరిస్థితి కొన్ని ప్రవేట్ పాఠశాలలో నెలకొన్నాయి. తాడిపత్రిలో చాలా ప్రైవేట్ స్కూళ్లలో నిర్వహణ అధ్వానంగా ఉండడంతో చాలా మంది విద్యార్థులు మరో ప్రాంతానికి వెళ్లి చదువుకుంటున్నారు. వందల సంఖ్యలో విద్యార్థులు కర్నూలు, అనంతపురం, గుడివాడ తదితర ప్రాంతాల్లో విద్య అభ్యషిస్తున్నారు. అధికారులు నిఘా ఉంచి ప్రైవేట్ పాటశాలల్లో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రేకుల షెడ్‌లో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

కనీస వసతులు లేవు



తాడిపత్రిలో కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో కనీస వసతులు లేవు. రూ.వేలకు వేలు ఫీజులు దండుకుంటున్నా కనీసం విద్యార్థులు మలమూత్ర విసర్జన ప్రశాంతంగా చేసుకోలేని పరిస్థితి ఉంది. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ విద్యార్థుల ఆరోగ్యం, భద్రత గాలికి వదిలేశారు. నిబంధనలు పాటించని ప్రైవేట్ స్కూల్‌ల అనుమతులు రద్దు చేయాలి.

– ఓబులేసు, ఏఐఎస్‌ఎఫ్ , డివిజన్ అధ్యక్షుడు

ధైర్యం, పోరాడేతత్వం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రధాన వక్త కొండా లలిత

గుంతకల్లుటౌన్: బాలికలు ధైర్యంతో పాటు పోరాడేతత్వం అలవర్చుకోవాలని దక్షిణ ఏపీ మాతృశక్తి సంయోజక్ సాదీకార్ గౌరీ, సేవికా సమితి ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ కొండా లలిత పిలుపునిచ్చారు. వీహెచ్‌పీ దుర్గా వాహిని-మాతృశక్తి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో మాతృవందన యాత్రను నిర్వహించారు. అమృతవర్షిణి బాలకల్యాణ ఆశ్రమం నుంచి మొదలైన ఈ యాత్ర బీరప్పగుడి సర్కిల్ వరకూ కొనసాగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భరతమాత రక్షణ కోసం ముష్కరదాడులను సమర్థవంతంగా ఎదుర్కొని భారతీయుల హృదయాల్లో స్థానం పొందిన గోండురాణి దుర్గావతి, పరిపాలనా సామర్థ్యానికి నారీశక్తి ఏనాడూ తీసిపోదని నిరూపించిన అహల్యాబాయి హోల్కర్‌లను స్ఫూర్తిగా తీసుకుని యువతులు ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షుడు మాణిక్‌చంద్ కార్వా, జిల్లా మాతృశక్తి సంయోజక్ కొణిదల జయలక్ష్మి, కోనంకి బిందు, పరిమలాచార్, పద్మకృష్ణమోహన్, అన్నపూర్ణమ్మ, గద్వాల్ మధుమతి, లింగుట్ల అశ్విని, మహిళలు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఏజెన్సీలను రద్దుచేయాలి



మాట్లాడుతున్న నాగేంద్రకుమార్

గుంతకల్లుటౌన్: ఆప్కాస్, ప్రైవేట్ ఏజెన్సీలను రద్దు చేసి మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ అనుబంధ పారిశుద్ధ్య కార్మికుల సంఘం సాధారణ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులను పర్మినెంట్ చేసే వరకూ దశలవారీగా ఉద్యమాలు చేపడతామన్నారు. స్థానికంగా పనిచేస్తున్న పీహెచ్ వర్కర్ల కనీస సమస్యలు పరిష్కరించలేని కమిషనర్ తన వైఖరిని మార్చుకోవాలన్నారు. కార్మికులకు పనిముట్లు ఇవ్వకపోతే, ఎలా పనిచేస్తారని ఆయన ప్రశ్నించారు. పెరిగిన పట్టణ జనాభా, విస్తీర్ణాన్ని దృష్టిలో పెంచుకుని కార్మికుల సంఖ్య పెంచాలని, రెగ్యులర్ కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే ఇవ్వాలని, లేకపోతే సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి నాగరాజు, అధ్యక్షుడు జగదీష్, మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకుడు నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి



డీఆర్‌ఎంతో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

గుంతకల్లు: రైల్వే సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని డీఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్తాకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఆర్‌ఎంను ఆయన చాంబర్‌లో కలసి వినతి పత్రం అందజేశారు. వారు పట్టణంలోని ధర్మవరం రైల్వే ఎల్‌సీ గేట్, కసాపురం మార్గంలోని సత్యనారాయణపేట వద్ద ఉన్న రైల్వే మోరీ విస్తరణతో పాటు హనుమాన్ సర్కిల్‌లోని జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపితే పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు కొంతమేర తగ్గుతాయన్నారు. అలాగే వెస్ట్ గుంతకల్లు-నంచర్ల మధ్య నూతనంగా నిర్మిస్తున్న బైపాస్ రైలు మార్గం నిర్మాణానికి భూములు కోల్పోయే రైతులకు నష్టపరిహారం విషయంలో న్యాయం జరిగేలా చూడాలని డీఆర్‌ఎంకు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహమ్మద్, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రుణ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

గుంతకల్లుటౌన్/గుత్తి: గుంతకల్లు పట్టణంలోని 1 నుంచి 20వ వార్డుల్లో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రభుత్వరంగ బ్యాంకు మేనేజర్లు, మెప్మా అధికారులు దరఖాస్తుదారుల సర్టిఫికెను పరిశీలించి ఇంటర్వ్యూ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ నయీమ్ అహ్మద్, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గుత్తి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా మెప్మా సీఎంఎం శ్రీనివాసరెడ్డి, సీఓలు చంద్రశేఖర్, సురేఖ, బ్యాంకర్లు పాల్గొన్నారు.

ఆడపిల్లలూ.. ధైర్యం కోల్పోవద్దు

తాడిపత్రిటౌన్: ఆడపిల్లలు ఎట్టి పరిస్థితుల్లో కూడా ధైర్యం కోల్పోకూడదని మాస్టర్ మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని జేహెచ్‌ఆర్‌ఎం గర్ల్స్ హైస్కూల్‌లో శుక్రవారం సెల్ఫ్ డిఫెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన పలు విన్యాసాలు చేసి చూపించారు. విద్య, ఆత్మవిశ్వాసం, రక్షణ అనే అంశాలపై అవగాహన కల్పించారు. సీడీపీఓ సాజిదాబేగం, సూపర్‌వైజర్‌లు లక్ష్మీదేవి, రామలక్ష్మి పాల్గొన్నారు.

ఆశ్రమ సందర్శన

తాడిపత్రి రూరల్: మండలంలోని చిన్న పొలమడ గ్రామ సమీపంలోని సౌభాగ్య కల్యాణ బాలల ఆశ్రమాన్ని శుక్రవారం వీహెచ్‌పీ జాతీయ కార్యదర్శి గోపరాజు గంగరాజు సందర్శించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బాలల ఆశ్రమం నిర్వహిస్తున్నారు. ఆశ్రమంలోని బాలలతో ఆయన మాట్లాడారు. ఆయన వెంట దక్షిణాంధ్ర అధ్యక్షుడు నందిరెడ్డిసాయిరెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

‘వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం’

పెద్దవడుగూరు: ఇంటర్, పదోతరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యమని ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్, ఎంఈఓ-2 గురుప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని దిమ్మగుడి, పెద్దవడుగూరులోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు మోటివేషనల్ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల సిబ్బంది, పాల్గొన్నారు.

నవోదయం పోస్టర్ల విడుదల

గుత్తి: నాటు సారా నిర్మూలనకు ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ తలపెట్టిన నవోదయం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. గుంతకల్లులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం చేతుల మీదగా ఎక్సైజ్ అధికారులు, పోలీసులు పోస్టర్లను విడుదల చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ మోహన్ రెడ్డి, ఎస్‌ఐలు అస్లాం బేగ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవం

గుత్తి రూరల్: మండలంలోని ఊటకల్లులో కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వేకువజాము నుంచి ఆలయంలో అర్చకులు అభిషేకాలు, అర్చనలు, హోమాలు, మహామంగళ హారతి తదితర ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామోత్సవం నిర్వహించారు. అయోధ్య మహిళా కోలాట బృందం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. రాత్రి చెక్క భజనలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా మాతృభాష దినోత్సవం

పామిడి: పట్టణంలోని టీసీ హైస్కూల్‌లో శుక్రవారం మాతృభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం వ్యాసరచన, క్రీడలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, హెచ్‌ఎం రామ్‌కుమార్, ఎస్.భాగ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

గుత్తి: రక్తదానం.. ప్రాణదానంతో సమానమని ఎస్‌ఐ సురేష్ అన్నారు. గుత్తిలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం రెడ్ ప్లస్ సంస్థ వ్యవస్థాపకుడు షెక్షావలి ఆధ్వర్యంలో రక్తదానంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఎం ఉషారాణి, రెడ్ ప్లస్ సంస్థ సభ్యులు మాఫిర్, ఖాజా మైనుద్దిన్, హరికృష్ణ, సాయి, అరుణ్, సోము తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

తాడిపత్రి రూరల్/పెద్దపప్పూరు: తాడిపత్రి పట్టణ సమీపంలోని పుట్లూరు రోడ్డులోని కస్తూరిబా బాలికల పాఠశాల, పెద్దపొలమడలోని హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు వైఎస్సార్ జిల్లాకు చెందిన వివేకానంద ఫౌండేషన్ సభ్యులు పెన్నులు, అట్టలు శుక్రవారం పంపిణీ చేశారు. ఫౌండేషన్ గౌరవ సలహాదారుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల పట్ల భయం వీడాలన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు రామక్రిష్ణారెడ్డి, శ్రీనివాసులు, శ్రీనివాసులురెడ్డి, వెంకటసురేష్, రాజశేఖర్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే పెద్దపప్పూరు: మండలంలోని జూటూరు గ్రామంలో ఉన్న కస్తూరిబా గాంధీ విద్యాలయంలో 10వ తరగతి, ఇంటర్ చదువుతున్న 92మంది విద్యార్థులకు వివేకానంద ఫౌండేషన్ సభ్యులు పరీక్ష సామగ్రి అందజేశారు.

సైబర్ నేరాలపై అవగాహన



సీవీ రామన్ కళాశాల ఆవరణలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడిపత్రి రూరల్: సైబర్ నేరాలపై శుక్రవారం అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో డీజిటల్ ఎల్ఈడీ స్క్రీన్‌పై అవగాహన కల్పించారు. మండలంలోని సర్ సీవీరామన్ ఇంజనీరింగ్ కళాశాల, తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాల, పాలిటెక్నికల్ కళాశాల్లోని విద్యార్థులకు సజ్జలదిన్నె, బుగ్గ గ్రామాలో సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

నేడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పల్లకీ సేవ

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరునాలలో భాగంగా శనివారం స్వామి వారి పల్లకిసేవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. రాత్రి 8 గంటలకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించి కోటంకలో గ్రామోత్సవం నిర్వహించి, స్వామి వారి సన్నిధికి చేరుస్తామన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



కొంగనపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఉద్యాన పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన శాస్త్రవేత్త జి.త్రికళ మాధవి సూచించారు. శుక్రవారం ఆమె హార్టికల్చర్ ఆఫీసర్ మిత్రవింద మాధవితో కలసి మండలంలోని కొంగనపల్లిలో పర్యటించారు. గ్రామంలోని ఎస్సీ రైతులకు ఉద్యాన పంటలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. చీనీ, టమాట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచిస్తూ యాజమాన్య పద్ధతులను వివరించారు. చీనీలో తామర పురుగు నివారణకు ఫిప్రోనిల్ 2 ఎంఎల్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వేరు పురుగు నివారణకు పోరేట్ త్రీజీ గుళికలను మొక్కకు 10 గ్రాముల చొప్పున చెట్టు పాదులను నీటితో నింపి వేయాలని సూచించారు. టమాట, మిర్చిలో మేలైన రకాలు, సాగు విధానం పంటసాగులో వచ్చే దిగుబడులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు, హార్టికల్చర్ సిబ్బంది పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్: ఉద్యానవన పంటల్లో రైతులు యాజమాన్య పద్ధతులను పాటించి అధిక దిగుబడులను సాధించాలని రెడ్డిపల్లి శాస్త్రవేత్త మాధవి, తాడిపత్రి ఉద్యానవన శాఖ అధికారి ఉమాదేవి సూచించారు. మండలంలోని ఇగుడూరు, బందార్లపల్లి, గంగాదేవిపల్లి గ్రామాల్లో ఎస్సీ రైతులు సాగు చేస్తున్న ఉద్యానవన పంటలైన మామిడి, సపోట, అల్లనేరేడులపై శుక్రవారం యజమాన్య పద్ధతులపై అవగాహన, శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు వారు మాట్లాడుతూ మామిడిలో తేనెమంచు పురుగు, ఫ్రూట్ ఫ్లై, తామర పురుగల నివారణలో మేలైన యాజమాన్య పద్ధతులను అనుసరించి నివారించాలన్నారు. మామిడి పిందెలకు తొడిమ వరకూ కవర్లు కట్టడం వల్ల తెగుళ్ల నుంచి కాయలను రక్షించుకోవచ్చన్నారు. సపోటాలో కాయ తొలుచు పురుగు నివారణకు మందులను పిచికారీ చేయాలన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాలు.. నలుగురికి గాయాలు

బుక్కరాయసముద్రం/గార్లదిన్నె: బుక్కరాయసముద్రం మండలంలోని చెన్నంపల్లి సమీపంలో అనంతపురం నార్పల రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. చెన్నంపల్లికి చెందిన పూజారి గోపి, రామాంజనేయులు అనంతపురం నగరంలో పని ముగించుకుని చెన్నంపల్లికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. చెన్నంపల్లి క్రాస్ వద్ద నార్పల రహదారిపై లారీని వెనుక భాగంలో ఢీకొన్నారు. ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు వారిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి 108 వాహనంలో తరలించారు. పోలీసులు కేసు నమెదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

▸▸ గార్లదిన్నె మండలంలోని శింగనమల క్రాస్‌లో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు అక్షర ఇంటర్నేషనల్ పాఠశాలలో కూలి పనిచేస్తున్న నెల్లూరుకు చెందిన సంతోష్ కుమార్ అనే యువకుడు పాఠశాల నుంచి పని నిమిత్తం గార్లదిన్నెలోకి నడుచుకుంటూ వెళ్తుంటే అదే సమయంలో పామిడి వైపు నుంచి అనంతపురానికి చెందిన మహమ్మద్ అనే యువకుడు ద్విచక్రవాహనంలో వస్తూ ఢీకొట్టాడు. ఘటనలో గాయపడిన ఇద్దరినీ స్థానికులు 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేద్దాం



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని సత్కరిస్తున్న మండల కన్వీనర్ సంజీవరాయుడు

యాడికి: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు సమష్టి కృషి చేద్దామని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సూచించారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా నియామకమైన యాడికి మండలం తూట్రాళ్లపల్లి గ్రామానికి చెందిన ఆ గ్రామ సర్పంచు మంగళ సంజీవరాయుడు శుక్రవారం యల్లనూరు మండలం తిమ్మంపల్లిలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతూ శాలువాతో సత్కరించారు. తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేసేందుకు రెట్టింపు ఉత్సాహంతో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తామని సంజీవరాయుడు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని కలిసిన వారిలో జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, నాయకులు చితంబరయ్య, మనోహరరెడ్డి(బుజ్జి) ఉన్నారు.

సీబీఐ విచారణ చేయించాలి



మాట్లాడుతున్న మోహన్‌నాయక్

పామిడి: జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై సీబీఐచే విచారణ చేయించాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బీ మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజు వేదింపులు, ఒత్తిళ్లు తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతూ కన్నతల్లిదండ్రుకు కడుపు కోత మిగిలిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి విద్యార్థుల ప్రాణాలను పొట్టపెట్టుకున్న ప్రైవేట్ విద్యాసంస్థలను సీజ్ చేయాలన్నారు. లేనిపక్షాన విద్యార్థులను సంఘటిత పరచి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆసంఘం విద్యార్థులు మణికంఠ, గోపినాథ్, భాస్కర్, రాము, రమేష్‌రెడ్డి, అశోక్‌బాబు, సాగేంద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

‘మా భూమిని కబ్జా చేస్తున్నారు’



మాట్లాడుతున్న బాధితులు

అనంతపురం టవర్‌క్లాక్: ‘బుక్కరాయ సముద్రం మండల కేంద్రంలోని శివాలయం గుట్ట సమీపంలో సర్వే నంబర్ 746-3, 747-2లో 57.50 సెంట్ల భూమిని టీడీపీ నాయకులు దౌర్జన్యంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. మాపై దాడి కూడా చేశారు. టీడీపీ నాయకుల నుంచి రక్షణ కల్పించాలి’ అని బాధితులు చిత్ర, నాగమ్మ, మోహన్ కుమార్, వెంకటరాముడు, ఆంజనేయులు కోరారు. శుక్రవారం వారు స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. భూమిని సర్వే చేయించుకుంటుండగా అనంతపురం రెండవ డివిజన్‌కు చెందిన టీడీపీ నాయకులు గుర్రం నాగభూషణం, అతడి తమ్ముడు నాగరాజు, పావురాల చంద్రశేఖర్ కొంత మంది అనుచరులతో వచ్చి దాడి చేశారని తెలిపారు. మా భూమిని దౌర్జన్యంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. వీరిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు సమగ్రంగా విచారించి న్యాయం చేయాలని కోరారు.

ఆక్రమణల తొలగింపును మళ్లీ అడ్డుకున్న గ్రామస్తులు

తాడిపత్రి రూరల్: మండలంలోని బొందలదిన్నె వద్ద హైవే రోడ్డు పనులకు అడ్డంగా ఉన్న ఆక్రమణల తొలగింపును శుక్రవారం మరోసారి గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామంలో అక్రమణ తొలగింపులో అధికారులు ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు వాపోయారు. విషయం తెలుసుకున్న అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, రెవెన్యూ, హైవే అధికారులు వెళ్లి సర్దిచెప్పారు. మండలంలో సమస్యాత్మక గ్రామాల్లో బొందలదిన్నె కావడం, అధికార, ప్రతిపక్ష పార్టీలు బలంగా ఉండటంతో శాంతిభద్రతల సమస్య ఏర్పడకుండా పోలీసు బందోబస్తును కొనసాగిస్తున్నారు.